క్లుప్తంగా

బీజేపీలో పలువురి చేరిక



పార్టీలో చేరిన వారితో నాయకులు

తుర్కయంజాల్: పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తున్నామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజ్ భూపాల్ గౌడ్ అన్నారు. పురపాలక సంఘం పరిధి ఇంజాపూర్ 24వ వార్డుకు చెందిన పలువురు మహిళలు శనివారం ఆయన సమక్షంలో పార్టీలో చేరగా.. వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ముత్యమమ్మ, ఝాన్సీ, ఈశ్వరమ్మ, సువర్ణ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యుడు బోసుపల్లి ప్రతాప్, ఎస్సీమోర్చా రాష్ట్ర కోశాధికారి రమేష్, సీనియర్ నాయకులు కందాల బల్‌దేవ్ రెడ్డి, మున్సిపాలిటీ అధ్యక్షుడు ఎలిమినేటి నర్సింహా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీసీసీ అధ్యక్షుడి జన్మదిన వేడుకలు



కేక్ కట్‌చేస్తున్న నాయకులు

ఆమనగల్లు: పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమనగల్లు పట్టణంలోని జాతీయ రహదారిపై రాజీవ్ చౌరస్తా వద్ద పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డిలు కేక్ కట్‌చేశారు. అనంతరం కేకు, ఫలాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, మాజీ అధ్యక్షుడు మండ్లి రాములు, పట్టణ అధ్యక్షుడు మానయ్య, యూత్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి ఫరీద్, నాయకులు జగన్, ఖాదర్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రసాద్, కరీం, కృష్ణనాయక్, సురేశ్, దోని, చంద్రు, రాగ్య, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న సీఐ సీతారామ్

కందుకూరు: సీసీ కెమెరాలతో నేరాలను నియంత్రించవచ్చని సీఐ సీతారామ్ అన్నారు. శనివారం మండల పరిధి నేదునూరు చౌరస్తా వద్ద మాజీ వైస్ ఎంపీపీ జి.శమంత తన సొంత నిధులు రూ.45వేలతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. నేరాలు జరిగినా వెంటనే నిందితులను గుర్తించడానికి కెమరాలు దోహదపడతాయన్నారు. అన్ని గ్రామాలు, కూడళ్ల వద్ద కెమెరాలను ఏర్పాటు చేసుకొని పోలీసులకు సహకరించాలని గ్రామస్తులను కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ సైదులు, కాంగ్రెస్ మండల కో–ఆర్డినేటర్ ఎండీ అఫ్జల్‌బేగ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎ.పుష్ప దర్శన్, పీఏసీఎస్ డైరెక్టర్ ఎస్.పాండురంగా రెడ్డి, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బొర్ర సురేష్, నాయకులు బాబు, మంజుల, జి.సంజీవరెడ్డి, ఎ.నర్సింహ, అజారుద్దీన్, ఫైజుద్దీన్, రవి, రాఘవేందర్‌రెడ్డి, కుమార్‌గౌడ్, భిక్షపతి, పోలీసు సిబ్బంది మల్లేశ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి..



తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

అబ్దుల్లాపూర్‌మెట్: యాభై ఏళ్లుగా తమ ఆధీనంలో ఉన్న భూములను దిల్ కంపెనీకి అప్పగించవద్దని బాధిత రైతులు కోరారు. ఈ మేరకు శనివారం బాటసింగారం గ్రామం సర్వే నంబర్ 10లోని అసైన్డ్ రైతులు తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన భూములను నమ్ముకొని జీవనోపాధి పొందుతున్న మాకు.. ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఆ సంస్థ ప్రతినిధులు కొందరు ఆ భూములకు ఫెన్సింగ్ వేయడానికి యత్నిస్తున్నారని పేర్కొన్నారు. మా భూములను కాపాడి న్యాయం చేయాలని కోరారు. దీనికి స్పందించిన తహసీల్దార్.. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటానని హామీఇచ్చినట్లు రైతులు తెలిపారు. పోచయ్య, పెంటయ్య, నర్సింహ, మైసయ్య, బుచ్చయ్య, లక్ష్మయ్య, మల్లయ్య, సాంబయ్య, వార్డు మాజీ సభ్యులు కృష్ణగౌడ్, వెంకటేశ్‌గౌడ్‌లు పాల్గొన్నారు.

ఆ భూములు తీసుకుంటాం..

పేదలకు పట్టాలు ఇస్తాం
- లబ్ధిదారులందరూ ఇళ్లు నిర్మించుకోవాలి
- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి
- ఆదిబట్ల, తుర్కయంజాల్‌లో మంజూరు పత్రాల అందజేత



ఇబ్రహీంపట్నం రూరల్: బొంగ్లూర్‌లో లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే



మాడ్గుల: కోల్కులపల్లిలో మంజూరు పత్రాలు అందజేస్తున్న నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: అన్యాక్రాంతమైన సర్కారు భూములను.. అక్రమార్కుల నుంచి స్వాధీనం చేసుకొని, వాటిల్లో పేదలకు ఇళ్ల పట్టాలు ఇస్తామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఆదిబట్ల, తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు శనివారం ఆదిబట్ల మున్సిపాలిటీ బొంగ్లూర్ ప్రమీదా గార్డెన్‌లో మంజూరు పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు.

ఐదేళ్లలో 20 వేల ఇళ్లు

ఎన్నికల ముందు హామీ మేరకు ఆరు గ్యారంటీలను ప్రభుత్వం అమలు చేస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా తొలుత అర్హులందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తామని పేర్కొన్నారు. అందులో మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీ సిబ్బంది, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీలకు మొదటి ప్రాధాన్యతగా గుర్తిస్తామన్నారు. అర్హులకు ఇళ్లు రాకపోతే ఫోన్ చేయాలని సూచించారు. బీఆర్ఎస్ హయాంలో జెండా పట్టిన వారికే అన్నీ ఇచ్చారని ఆరోపించారు. మనం మాత్రం నిజమైన లబ్ధిదారులకు లబ్ధి చేకూర్చే విధంగా కృషి చేద్దామని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఐదేళ్లలో 20 వేల ఇళ్లను పేదలకు కేటాయిద్దామని చెప్పారు.

వదిలిపెట్టే ప్రసక్తే లేదు

ఆదిబట్ల మున్సిపాలిటీ, కొంగరకలాన్, ఆదిబట్ల, కలెక్టరేట్ ప్రాంతాల్లో ప్రభుత్వ భూములను కొందరు కబ్జా చేశారని తెలిసిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కోర్టుకు వెళ్లినా వాటిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని, క్లియరెన్స్ చేసి ఆ భూములను గుంజుకొని, వాటిల్లోనే పేదలకు ఇళ్ల పట్టాలు ఇస్తానని స్పష్టంచేశారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి, హౌసింగ్ పీడీ డీసీ నాయక్, తుర్కయంజాల్ కమిషనర్ అమరేందర్‌రెడ్డి, ఆదిబట్ల కమిషనర్ బాలకృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మహిపాల్, కాంగ్రెస్ ఆదిబట్ల మున్సిపాలిటీ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లు

మాడ్గుల: అర్హులందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు కేటాయిస్తుందని కాంగ్రెస్ పార్టీ నాయకుడు బట్టు కిషన్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన మండల పరిధి కోల్కులపల్లి గ్రామంలో పలువురు లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేసి మాట్లాడారు. గత ప్రభుత్వం మాటలతో కాలక్షేపం చేసిందని, అధికారం చేపట్టిన అనతి కాలంలోనే కాంగ్రెస్ సర్కార్ అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పేదల కల సాకారం



ఇంటి నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న నాయకులు

కడ్తాల్: ఇందిరమ్మ రాజ్యంలో నిరుపేదల సొంతింటి కల సాకారం అవుతోందని, అర్హులందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇళ్లను నిర్మించి ఇవ్వనుందని పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శనివారం మండల పరిధి అన్మాస్‌పల్లి, ఎక్వాయిపల్లి, సాలార్‌పూర్‌లో పలువురు లబ్ధిదారులకు మంజూరు అందజేశారు. నిర్మాణ పనులను మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డితో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గానికి 4500 ఇందిరమ్మ ఇళ్లను నిర్మించేందుకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్ , సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, సేవాదళ్ అధ్యక్షుడు లక్ష్మయ్య, మాజీ ఎంపీటీసీ ఉమావతి, మాజీ సర్పంచ్‌లు శంకర్, విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి

- పంట మార్పిడి తప్పనిసరి
- వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ రజనీకాంత్



మాట్లాడుతున్న శాస్త్రవేత్త రజనీకాంత్

ఇబ్రహీంపట్నం: పంట రకాన్ని బట్టి అవసరం మేరకు ఎరువులు, నీరు అందించాలని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ రజనీకాంత్ అన్నారు. ముకునూర్ గ్రామం రైతు వేదికలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి పొందే పద్ధతులను వ్యవసాయంలో ఉపయోగించుకోవాలని సూచించారు. పంట మార్పిడి తప్పనిసరిగా చేయాలన్నారు. భూసార పరీక్షలు చేయించుకోవాలని, దానిని బట్టే వ్యవసాయ అధికారుల సూచనలు మేరకు ఏ పంటలు వేయాలో నిర్ణయం తీసుకోవాలని చెప్పారు. తద్వారా పర్యావరణాన్ని కాపాడిన వారమౌతామని తెలిపారు. పురుగు మందుల వినియోగంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాని, విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు ఇలా ఏం కొనుగోలు చేసినా, రసీదులు తీసుకోవాలని వివరించారు. రైతులు అడిగిన ప్రశ్నలకు శాస్త్రవేత్తలు సమాధానం చెప్పారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ అరుణశ్రీ, డాక్టర్ వెంకట్రామ్, వెటర్నరీ డాక్టర్ ఆనంద్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి విద్యాధరి, ఏఈఓ సృజన, గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు. వ్యవసాయ అధికారులను కార్యదర్శి సన్మానించారు.



పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు

ఉపాధ్యాయులు నిత్య విద్యార్థులు

మాడ్గుల: ఉపాధ్యాయులు కొత్త విషయాల గురించి అవగాహన పొందుతూ నిత్య విద్యార్థులుగా ఉండాలని ఎంఈఓ సర్దార్ నాయక్ సూచించారు. టీచర్లకు రిసోర్స్‌పర్సన్లు అంశాలపై జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. శనివారం శిక్షణ శిబిరంలో ఎంఈఓ మాట్లాడారు. విద్యార్థులను ఆకట్టుకునే విధంగా పాఠ్యాంశాలను బోధించాలన్నారు. కొత్త అంశాలను చిన్నారులకు తెలియ పర్చాలని చెప్పారు. తెలుగు, ఆంగ్లం, గణితం, పరిసరాల విజ్ఞానంతో పాటు ఉపాధ్యాయుల సామర్థ్యంపై శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు.

బిల్లుల విడుదల హర్షణీయం

ఆమనగల్లు: మాజీ సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులను ప్రభుత్వం విడుదల చేయడం హర్షదాయకమని తలకొండపల్లి మండలం పడకల్ మాజీ సర్పంచ్ శ్రీశైలం అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం సర్పంచ్‌ల మెడపై కత్తి పెట్టి అభివృద్ధి పనులను చేయించిందని, కానీ చేసిన పనులకు బిల్లులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేసిందని ఆరోపించారు. బిల్లులు రాక, అప్పులు తీర్చే మార్గం లేక కొంతమంది సర్పంచ్‌లు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆలస్యమైనా కాంగ్రెస్ సర్కార్ బిల్లులు విడుదల చేసి ఆదుకుందని పేర్కొన్నారు. బిల్లులను విడతలవారీగా మంజూరు చేస్తున్న ప్రభుత్వాన్ని కొందరు విమర్శిస్తున్నారని, అది మంచిది కాదని హితవు పలికారు.

పకడ్బందీగా గ్రామ సంఘాలు



మాట్లాడుతున్న అడిషనల్ డీఆర్‌డీఓ సూర్యారావు

- మొండి బకాయిలపై దృష్టి సారించాలి
- అడిషనల్ డీఆర్‌డీఓ సూర్యారావు

ఇబ్రహీంపట్నం: గ్రామ సంఘాల నిర్వహణ పకడ్బందీగా ఉండాలని అడిషనల్ డీఆర్‌డీఓ సూర్యారావు అన్నారు. ఇబ్రహీంపట్నం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో 2024– 25 ఆర్థిక సంవత్సరం గ్రామ సంఘాల లావాదేవీలను సెర్ప్ అడిట్ అధికారులతో కలిసి శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. శ్రీనిధి ద్వారా మహిళా సంఘాలు పొందిన రుణాలు సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మొండి బకాయిలపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. సీఐఎఫ్, శ్రీనిధి రీ పేమెంట్స్‌పై ప్రతినెల పుస్తకాల్లో రాయాలని, నిర్లక్ష్యం చేయరాదని పేర్కొన్నారు. మండల పరిధి సెర్ప్ సిబ్బందితో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి, ఈ ఆర్థిక సంవత్సరం బ్యాంకు లింకేజీ, నిర్ణీత టార్గెట్ ఏ మేరకు సాధించమో చర్చించుకోవాలని చెప్పారు. పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై బీమాలో మహిళా సంఘాలు కొత్త సభ్యులను చేర్పించాలని, పాత వారివి రెన్యూవల్ చేయించాలని వివరించారు. స్కూల్ యూనిఫాం స్టిచింగ్ నిర్వహణను సంఘాల సభ్యులు సక్రమంగా నిర్వర్తించి, సకాలంలో అందించాలన్నారు. సెర్ప్ ఆడిటర్స్ మధు, శ్రీనివాస్, డీపీఎం (ఎఫ్ఐ) బాలరాజ్, డీపీఎం(ఫెనాన్స్) యాదయ్య, మండల ఏపీఎం రవీందర్, సీసీలు నర్సింహ, కృష్ణయ్య, చంద్రిక, ఆనంద్‌కుమార్, జంగమ్మ, రమాదేవి, ఎంఎస్ సిబ్బంది, వీఓఏలు పాల్గొన్నారు.



రావిర్యాల చిన్నకంచెలో మట్టి తవ్వకాలు జరిపిన ప్రదేశం

దర్జాగా.. దందా

- రెచ్చిపోతున్న మట్టిమాఫియా
- సర్కారు భూముల్లో అక్రమంగా తవ్వకాలు
- టిప్పర్లలో తరలింపు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

తుక్కుగూడ: జోరుగా యథేచ్ఛగా అక్రమ మట్టిదందా సాగుతోంది. మున్సిపాలిటీలోని రావిర్యాల రెవిన్యూ పరిధి చిన్నకంచె, కలెక్టర్ కార్యాలయం వెనుక ప్రభుత్వ భూమిలో చాలాకాలంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా కలెక్టరేట్ వద్ద సర్వే నంబర్ 289లోని భూమిని.. ప్రభుత్వం ఎలాక్ట్రానిక్ సిటీకి కేటాయించగా.. అందులో నుంచే మట్టిమాఫియా ఇష్టానుసారంగా మట్టి, మొరంను దర్జాగా కొల్లగొడుతూ.. వేలాది టిప్పర్లలో తరలించి సొమ్ముచేసుకుంటోంది.

ఒక్కో టిప్పర్‌కు రూ.6,500

తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలో విల్లాలు, బహుళ అంతస్తుల భవనాల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. దీంతో మట్టికి డిమాండ్ అధికంగా ఉంది. ఇదే అదునుగా భావించిన కొందరు వ్యాపారులు సర్కారు భూములను లక్ష్యంగా చేసుకొని రాత్రి వేళలో అందినకాడికి మట్టిని తోడేస్తున్నారు. ఒక్కో టిప్పర్‌కు రూ.5 వేల నుంచి రూ.6,500 వరకు విక్రయిస్తూ.. నిత్యం వందల టిప్పర్లలో తరలిస్తున్నారు. మట్టిని బట్టి ధర పెంచుతూ రూ.లక్షలు కొల్లగొడుతున్నారు.

సర్కారు భూమిలో..

హైవే రోడ్డు పక్కన, సర్కారు భూమిలో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు జరుగుతున్నా.. రెవిన్యూ, పోలీసు అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. కొద్ది రోజుల క్రితం మహేశ్వరం, కందుకూరు మండలంలో ఎస్ఓటీ అధికారులు మట్టి మాఫియా పై దాడులు చేశారు. కానీ తుక్కుగూడ కేంద్రాలపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో అనేక అనుమానాలకు తావిస్తోంది. ఈ వ్యాపారం వేనుక రాజకీయ నాయకులతో పాటు, వివిధ శాఖల ఉన్నతాధికారులు ఉన్నట్లు సమాచారం. పాత నేరస్తులే దందాను కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమ మట్టి దందాను నియత్రించి, సర్కారు భూములను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

“ చర్యలు తీసుకుంటాం

మట్టి తవ్వకాలు చట్ట రీత్యా నేరం. మట్టి మాఫియాను నివారించడానికి రెవిన్యూ సిబ్బందితో ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేస్తాం. నిఘా పటిష్టం చేస్తాం. అక్రమ వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– సైదులు తహసీల్దార్, మహేశ్వరం

అభివృద్ధికి సహకరించండి



సుఖేందర్‌రెడ్డితో కాంగ్రెస్ నాయకుడు

ఆమనగల్లు: శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని శనివారం మాడ్గుల మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకుడు జల్ల రమేశ్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. నగరంలోని శాసనసభ ఆవరణ కార్యాలయంలో ఆయనను కలిసి సన్మానించారు. మండల అభివృద్ధికి సహకరించాలని చైర్మన్‌ను రమేశ్ అభ్యర్థించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

తుక్కుగూడ: పార్టీ శ్రేణులు ప్రజల మధ్య ఉంటూ.. వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ సూచించారు. శనివారం మున్సిపాలిటీలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల మధ్య ఉండి, పార్టీని బలోపేతం చేసిన వారికి పార్టీలో ప్రాధ్యాన్యత ఉంటుందని తెలిపారు. త్వరలో జరిగే స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం, మహిళలకు 33 శాతం రిజర్వేషన్ పార్టీ కల్పిస్తుందన్నారు. పార్టీని నియోజకవర్గ వ్యాప్తంగా బలోపేతం చేయాలని సూచించారు. ప్రభుత్వం అర్హులకు మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు జరిగేలా చూడాలన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా జైబాపు, జైబీమ్, జై సంవిధాన్ కార్యక్రమంతో దేశంలో బీజేపీ చేస్తున్న అరాచకాలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. సమావేశంలో జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, మహేశ్వరం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కృష్ణానాయక్, బడంగ్‌పేట మాజీ మేయర్ చిగురింత పారిజాత, మహేశ్వరం మాజీ ఎంపీపీ రఘుమారెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

విద్యా బోధనలో సాంకేతికత అవసరం

షాబాద్: విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ సూచించారు. శనివారం షాద్‌నగర్ ఢిల్లీ వరల్డ్ పాఠశాలల్లో జరుగుతున్న మండల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు 5వ రోజు శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బోధనలో వినూత్న పద్ధతులు, సాంకేతికత ఎంతో అవసరమన్నారు. విద్యార్థులను ఆకట్టుకునే విధంగా ఉపాధ్యాయులు పాఠ్యాంశాలను బోధించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రాథమిక స్థాయిలో ఉపాధ్యాయులు నాణమైన విద్య అందించాలన్నారు. ఉపాధ్యాయులు తమ నైపుణ్యాన్ని పెంచుకునేందుకు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు శిక్షణ అందించినట్లు తెలిపారు. ఐదురోజుల పాటు శిక్షణలో నేర్చుకున్న విద్యావిధానంలో కొత్త మెలకువలతో విద్యార్థులకు పాఠాలు బోధించాలన్నారు. శిక్షణ తరగతుల్లో ఎఫ్ఎల్ఎన్, మూల్యాంకనం, కనీస అభ్యాసన సామర్థ్యాలు, సులభంగా గణితం నేర్చుకోవడం తదితర అంశాలపై శిక్షణ అందించినట్లు వెల్లడించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యాబోధన మెరుగుపరచుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచుకోవాలని కోరారు.